క్లుప్తంగా

ప్రేమ పెళ్లి వద్దన్నందుకు..

- బ్లేడుతో గొంతు కోసుకున్న యువకుడు

ఆదోని అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన షాబీర్అలీ అనే యువకుడిని కుటుంబసభ్యులు ప్రేమ పెళ్లి వద్దనడంతో బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు ప్రయతి ్నంచిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు అన్న అబ్దుల్లా పోలీసులకు తెలిపిన వివరాలు.. షాబీర్అలీ ప్రేమవివాహం చేసుకుంటానని ఆదివారం కుటుంబ సభ్యులకు తెలపగా వారు నిరాకరించారన్నారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు చెప్పారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హ్యాండ్ బాల్లో కర్నూలు ప్రతిభ



ఆల్ ఇండియా పోటీల్లో రన్నర్స్గా నిలిచిన కర్నూలు సాయి జట్టు

కర్నూలు (టౌన్): ఈ నెల 24 నుంచి 26 వరకు గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ రీజినల్ సెంటర్లో నిర్వహించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయి) హ్యాండ్బాల్ చాంపియన్షిప్లో కర్నూలు సాయి జట్టు ప్రతిభ చూపింది. ఫైనల్లో ఎస్టీసీ బావన బీటీ జట్టుతో తలపడి 32–36 స్కోర్తో రన్నర్స్ కప్ గెలుపొందింది. దీంతో జిల్లా జట్టుకు హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి రుద్రారెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

డీఎంజీఓగా మారనున్న మైనింగ్ డీడీ కార్యాలయం

కర్నూలు(రాజ్విహార్): గనులు, భూగర్భ శాఖ కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ (ఉప సంచాలకులు) కార్యాలయ పేరు మారనుంది. జిల్లా మైనింగ్ అండ్ జియోలజీ కార్యాలయంగా మార్పులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాల పునర్విభజన తరువాత పలు శాఖల అధికారులు హోదాలు, కార్యాలయాల పేర్లను మార్పులు చేసిన ప్రభుత్వం తాజాగా మైనింగ్ శాఖ కార్యాలయాన్ని మార్పులు చేస్తోంది. దీనిని ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు.

దాసరి రంగముని సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న జీఎస్టీ డిప్యూటీ కమిషనర్

కర్నూలు కల్చరల్: కళారంగంలో దాసరి రంగముని సేవలు ప్రశంసనీయమని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ సురేష్ అన్నారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం కందుకూరి విశిష్ట పురస్కార గ్రహీత దాసరి రంగముని సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రంగస్థల కళారంగానికి రంగముని ఎంతో సేవ చేసి అనేక మంది కళాకారులను తీర్చిదిద్దారన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఖవ్వాలి అంతర్జాతీయ గాయకులు న్యామతుల్లా, సీనియర్ సంగీత గురువు పాండురంగయ్య, నృత్య గురువులు నారాయణస్వామి, కరీముల్లాలను సత్కరించారు.

పతకాలు సాధించడం జిల్లాకే గర్వకారణం

కర్నూలు (టౌన్): విశాఖపట్నంలో నిర్వహించిన అంతర్జాతీయ ఇన్విటేషన్ ఓపెన్ కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించడం జిల్లాకే గర్వకారణమని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు జగదీష్కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కింగ్ మార్కెట్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గెలుపొందిన క్రీడాకారులను పతకాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, ప్రతినిధులు అవినాష్ శెట్టి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, సెల్ఫీ, కోనసీమ థగ్స్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, అమిగోస్, కోనసీమ థగ్స్, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: వాల్తేరు వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్, సెల్ఫీ, మిరపకాయ్, కొకైన్ బీర్, అలా మొదలైంది
భరత్ కాంప్లెక్స్ : మిరపకాయ్
రాజ్ : మిస్టర్ కింగ్
శ్రీరామ : డెడ్లైన్, **విజయ** : సార్

నడకతో ఆరోగ్యం పదిలం

- రోజూ అరగంట నుంచి గంట వరకు వాకింగ్ ఉత్తమం
- నియంత్రణలోకి దీర్ఘకాలిక వ్యాధులు
- మైదానంలో పెరుగుతున్న వాకర్లు



వాకింగ్ చేస్తున్న వాకర్లు

కర్నూలు(హాస్పిటల్): యాంత్రిక జీవనం అలవాటు పడ్డాక మనిషి శారీరక శ్రమను బాగా తగ్గించేశాడు. ఫలితంగా స్థూలకాయం వస్తోంది. చిన్నవయస్సులోనే బీపీ, షుగర్ లాంటి జబ్బులు పట్టుకుంటున్నాయి. ఈ కారణంగా జీవితం నిస్సారమై పోతోంది. ఈ జాడ్యాన్ని వదిలించుకోవాలంటే వాకింగ్(నడక) ఒక్కటే మార్గమని వైద్యులు వక్కానించి చెబుతున్నారు. అందుకే ఇటీవల కాలంలో చాలా మంది ఉదయాన్నే మైదానాల బాట పడుతున్నారు. వాకింగ్ చేయడానికి ఎలాంటి శ్రమా అక్కర్లేదు. ఎవరైనా చేయవచ్చు. దీనికి ఖర్చు పెట్టే అవసరమూ లేదు. పొద్దున్నే లేచి మైదానంలో నాలుగు అడుగులు వేస్తే చాలు అదే వాకింగ్ అయిపోతుంది. అయితే వ్యక్తి సామర్థ్యాన్ని బట్టి కనీసం రోజులో అరగంట నుంచి గంట పాటు వాకింగ్ చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల కాలంలో వాకర్స్ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఆయా చోట్ల వాకర్స్ అసోసియేషన్స్ కూడా ఏర్పాటు కావడం గమనార్హం. కర్నూలు నగరంలో దిన్నెదేవరపాడు రోడ్డు, బి.క్యాంపులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కలెక్టరేట్, ఎస్టీబీసీ కళాశాల, అవుట్డోర్ స్టేడియం మైదానాలతో పాటు కాలనీల్లోని చిన్న పార్కుల్లో, కేసీ కెనాల్ బండ్, నంద్యాల రోడ్డు, నందికొట్కూరు రోడ్డు, గుత్తిరోడ్డులలో సైతం వాకర్లు ఉదయాన్నే వాకింగ్ చేస్తున్నారు. కర్నూలుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండలలోనూ వాకర్స్ అధికమయ్యారు.

ఉదయం నడకే మంచిది...

ఒక మైలు దూరాన్ని 13 నిమిషాలు, అంతకన్నా తక్కువ సమయంలో నడిచినట్లయితే వంద క్యాలరీలు ఖర్చు అవుతాయి. ఈ లెక్కన ఎంత బరువు తగ్గాలనుకున్నా, దానికి ఎన్ని మైళ్లు నడవాలో మీరే నిర్ణయించుకోవచ్చు. ఉదయం సమయంలో సూర్య కిరణాలు శరీరానికి విటమిన్–డి అందేలా చూస్తాయి. ఆ విటమిన్ కూడా బరువు తగ్గేందుకు సహకరించడంతో పాటు గుండెకూ మేలు చేస్తుంది. ఉదయాన్నే నిద్రలేవడం వల్ల జీవక్రియల రేటు సక్రమంగా ఉంటుంది. నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలోని కొవ్వులు, కెలొరీలు అధికంగా కరుగుతాయి. అంతేగాక క్రుంగుబాటును, అతిశయోక్తిని తగ్గిస్తుంది. బీపీని నియంత్రణలో ఉంచుతుంది. కొన్ని క్యాన్సర్ వ్యాధులు రాకుండా నిరోధిస్తుంది. షుగర్ వ్యాధి ఉన్న వారికి బాగా పనిచేస్తుంది. మానసిక స్థితిని బలపరుస్తుంది. ఎముకలను గట్టిగా, దృఢంగా చేస్తుంది.

జాగింగ్ ఇలా చేయాలి

పరుగుతో ఆరోగ్యంతో పాటు శరీరాకృతిలోనూ మార్పులు వస్తాయి. తొడలు, పిరుదులు, పొట్టచుట్టూ ఉండే కొవ్వు పదార్థాలు కరిగిపోతాయి. వలయాకారంలో ఉండే ట్రాక్లో 40 నిమిషాల్లో నాలుగు కిలోమీటర్లు పరిగెత్తాలని నిపుణులు చెబుతున్నారు. ఇలా పరిగెత్తేటప్పుడు...మొదట వార్మప్ కోసం నాలుగు రౌండ్లు(రౌండ్ 400 మీటర్లు) మామూలుగా నడవాలి. తర్వాత రెండురౌండ్లు నడకలాంటి పరుగుతో వెళ్లాలి. ఒక రౌండు వేగవంతమైన నడక, రెండు రౌండ్లు నడకలాంటి పరుగు చేయాలి. తర్వాత ఒక రౌండు వేగం పెంచి నడిచి, ఒక రౌండు కాస్త తక్కువ వేగంతో నడవాలి. చివరగా రెండు రౌండ్లు సాధారణమైన నడకతో వ్యాయామం ముగించాలి.

బీపీ నియంత్రణలోకి వచ్చింది



నేను ఏడేళ్ల నుంచి వాకింగ్ చేస్తున్నాను. మొదట్లో బీపీ మొదలైందని డాక్టర్ వద్దకు వెళ్లాను. డాక్టర్ సూచన మేరకు రోజూ వాకింగ్ ప్రారంభించాను. అప్పట్లో కాస్త బరువు ఎక్కువగా ఉండేవాన్ని. ఇప్పుడు బరువు తగ్గడంతో పాటు బీపీ కూడా నియంత్రణలోకి వచ్చింది. దీంతో పాటు శరీర ఫిట్నెస్ కూడా బాగుంది.

–జి.సత్యనారాయణ, ఉద్యోగి, కర్నూలు

గుండెజబ్బులు రాకుండా ఉంటాయి



రెగ్యులర్గా వాకింగ్ చేయడం వల్ల శరీర బరువుతో పాటు కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. దీనివల్ల గుండెజబ్బులు, గుండెపోటుకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ప్రతిఒక్కరూ రోజూ ఉదయాన్నే అరగంట నుంచి గంట పాటు వాకింగ్ చేయడం ఎంతో ఉత్తమమైన వ్యాయామం.

–డాక్టర్ తేజానందన్రెడ్డి, గుండెవ్యాధి వైద్యనిపుణులు, కర్నూలు

నేటి నుంచి బాలోత్సవం

కర్నూలు కల్చరల్: సృజనాత్మకత వెలికి తీసే ప్రయత్నమే బాలోత్సవం అని రవీంద్ర విద్యా సంస్థల అధినేత, బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు స్థానిక ఇండస్ పాఠశాలలో బాలోత్సవం జరుగుతుందన్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణ, క్లాసికల్ డ్యాన్స్, జానపద నృత్యం, కోలాటం, లఘునాటిక, దేశ భక్తి గీతాలాపన తదితర అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. బాలోత్సవం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కన్వీనర్లు కెంగార మోహన్, జేఎన్ శేషయ్య, ఎం.పి. బసవరాజు, కమిటీ సభ్యులు జయరాజు, ఈశ్వరయ్య, వినయ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రజక శీనును చంపిన వారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): పల్నాడుజిల్లా దాచేపల్లిలో రజక కులానికి చెందిన గరికపాటి శ్రీనివాసరావును అత్యంత క్రూరంగా చంపిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముక్కన్న, సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..స్థానిక వాటర్ వర్కులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీనివాసరావును అక్కడ పనిచేస్తున్న సైదులు వ్యక్తిగత విషయాలకు వెళ్లి ఆవేశానికి లోనై చంపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు శేషాద్రి, రాముడు, శ్రీనివాసులు, జయమ్మ, రవిశంకర్ పాల్గొన్నారు.

8న 'నీ గానమే నా ప్రాణం'



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం ఫాల్గుణ మాసం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని మార్చి 8వ తేదీన 'నీ గానమే నా ప్రాణం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు గోపాల్రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సప్తగిరినగర్ మణికంఠ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆలయంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరాయంగా 12 గంటల పాటు అఖండ భజన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాషాయ ధ్వజారోహణ, గోపూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన, సాయంత్రం 6.30 గంటలకు మహా పడి పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి అధ్యక్షులు రాజు దేశ్ పాండే, ఆలయ కమిటీ జాయింట్ సెక్రటరీ మహేష్, కోశాధికారి రమేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్): బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. ఆదివారం అవాజ్ కమిటీ జిల్లా మహాసభలు కార్మిక, కర్షక భవన్లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వారు స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషర్లకు అనుకూలంగా వ్యవహరించారన్నారు. అందువల్లనే భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించి హిందు భావజాలంతో లౌకిక విలువలను మంట గలుపుతున్నారన్నారు. అందరినీ కలుపుకొని పోవాలని తపించిన గాంధీని గాడ్సే చంపాడని, ఆయన ఆర్ఎస్ఎస్ వాది అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక ముస్లింలు, మహిళలు, కవులు, కళాకారులపై నిత్యం దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిస్తీ మాట్లాడుతూ..దేశంలో కార్పొరేట్ శక్తులు ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ముస్లింలు, క్రైస్తవులను ఏకం చేయాలన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ ఓడిపోవడం ఖాయమని, ముస్లింలెవరూ బీజేపీ సిద్ధాంతాలను నమ్మరన్నారు. జిల్లా కార్యదర్శి సుభాన్ మహాసభల నివేదికను చదివి వినించారు. ఈ సభలో ముస్లింల సమస్యలు చర్చించుకొని భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్లు చెప్పారు. అనంతరం తీర్మాణాలను ఆమోదించారు. కార్యక్రమంలో అవాజ్ గౌరవాధ్యక్షుడు అబ్దుల్ జబ్బర్ మౌలానా, గౌరవ సలహాదారుడు డి.గౌస్ దేశాయ్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు అబుబాకర పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (టౌన్): గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి గురుస్వామి కోరారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కార్మిక కర్షక భవన్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని, ప్రమోషనల్ చానల్ ఏర్పాటు చేయాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సంక్షేమ సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా మద్దిలేటి, కార్యదర్శిగా సంధ్యారాణి, ఉపాధ్యక్షులుగా శివప్రసాద్, చిట్టిబాబు, మహేశ్వరమ్మ, కార్యదర్శులుగా తారకేశ్వర రెడ్డి, రాజశేఖర్లను ఎన్నుకున్నారు.

నగరపాలక నూతన కమిటీ :

కర్నూలు నగరపాలక సంస్థ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా శివప్రసాద్, కార్యదర్శిగా తారకేశ్వరరెడ్డి, కోశాధికారిగా బి.రాముడు, కార్యనిర్వహణ కార్యదర్శిగా కిరణ్ ఉపాధ్యక్షులుగా వెంకటరాముడు, తిమ్మప్ప, చంద్రశేఖర్, షేక్షావలి, సహాయ కార్యదర్శులుగా రమేష్, జయకుమారి, చిట్టిబాబు సభ్యులుగా పట్టాబి, చిన్న సుబ్బరాయుడు, అబ్దుల్ బషీర్, నాయుడు, రామసుబ్బమ్మ, రాజశేఖర్లను ఎన్నుకున్నారు.

వీధి కుక్కల సమూహాలకు దూరంగా ఉండాలి



రోడ్డుపై మాంసం విక్రయాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఇన్చార్జ్ కమిషనర్ ఎస్వీ రమాదేవి

కర్నూలు (టౌన్): వీధి కుక్కల సమస్య ఉంటే స్థానిక సచివాలయాల్లో తెలియజేయాలని నగర పాలక ఇన్చార్జ్ కమిషనర్ ఎస్వీ రమాదేవి అన్నారు. ఆదివారం నగరపాలక సంస్థ పరిధిలోని 17 శానిటేషన్ డివిజన్లలో కుక్క కాటు నివారణకు సూచనలు పేరుతో బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీలు చేపట్టారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో చికెన్, మటన్ సెంటర్ల వద్ద అవగాహన కల్పించారు. ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు, మాంస పదార్థాలు వేయవద్దని సూచించారు. అలాగే రోడ్లపై మాంసం విక్రయాలు చేపడుతున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్చార్జ్ కమిషనర్ రమాదేవి మాట్లాడుతూ నగరంలో పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు తప్పని సరిగా వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. వీధికుక్కలను తరలిస్తూ ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్) కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వీధి కుక్కల సమూహాలకు దూరంగా ఉండాలన్నారు. పిల్లలను తినుబండరాల కోసం పర్యవేక్షణ లేకండా పంపించవద్దని సూచించారు. వీధి కుక్కలు వెంబడిస్తే తమ చేతిలో ఉన్న తిను బండారాలు దూరంగా పడేయడం, అక్కడే నిశబ్ధంగా నిలబడితే సరిపోతుందన్నారు.

ముగిసిన కిక్ బాక్సింగ్ సెమినార్



బెల్ట్ గ్రేడింగ్లో ప్రతిభ చాటిన బాల బాలికలకు ప్రశంసా పత్రాలు అందజేసిన అతిథులు

కర్నూలు (టౌన్): త్రినాథ్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి వాకో కిక్ బాక్సింగ్ సెమినార్ ఆదివారం సాయంత్రం ముగిసింది. కిక్ బాక్సింగ్ బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన బాల బాలికలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా వైఎస్సార్సీపీ మహిళా నాయకురాలు విజయ మనోహరి, విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వాకో ఇండియా జాతీయ అధ్యక్షులు సంతోష్ కె.అగర్వాల్, నరేంద్ర ఆచారి పాల్గొన్నారు.

సంక్షిప్తం

1న డాక్టర్జీ స్ఫూర్తి మందిరానికి భూమిపూజ

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఆధ్వర్యంలో వచ్చే నెల 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు కాల్వబుగ్గ సమీపంలోని సురభి గోశాల ఆవరణలో డాక్టర్జీ స్ఫూర్తి మందిరానికి భూమి పూజ కార్యక్రమం జరుగుతుందని, శ్రీ విద్యారణ్య భారతి స్వామి పాల్గొంటారని వికాస భారతి సంఘటనా కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

సురభి గోశాల పుష్కరోత్సవాలు

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఆధ్వర్యంలో వచ్చే నెల 22 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు సురభి గోశాల పుష్కరోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గోశాల కార్యదర్శి పోచ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 7న కాల్వబుగ్గ సమీపంలోని సురభి గోశాల ఆవరణలో గోమాత భక్త సమ్మేళనం, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

లైఫ్ సర్టిఫికెట్ల అప్లోడ్కు గడువు 2 రోజులే...

కర్నూలు(అగ్రికల్చర్): పెన్షనర్లు ఈ నెల 28లోగా వార్షిక వెరిఫికేషన్ సర్టిఫికెట్లను సంబంధిత సబ్ ట్రెజరీ అధికారులకు అప్లోడ్ చేయాల్సి ఉంది. ఇందుకు గడువు రెండు రోజులు మాత్రమే ఉంది. జిల్లాలో ట్రెజరీ నుంచి పెన్షన్ తీసుకునే వారు 18,492 మంది ఉన్నారు. వీరందరు ప్రతి ఏటా తాము బ్రతికి ఉన్నట్లు లైఫ్ సర్టిఫికెట్లను సంబంధిత సబ్ ట్రెజరీలకు జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా అప్లోడ్ చేయాలి. అయితే ఇప్పటి వరకు 13,667 మంది అప్లోడ్ చేశారు. ఇంకా 4825 మంది అప్లోడ్ చేయాల్సి ఉంది. ఆదోని డివిజన్ సబ్ ట్రెజరీలో 501 మంది, ఆలూరు సబ్ ట్రెజరీలో 140, గూడూరు సబ్ ట్రెజరీలో 145, కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీలో 3695, పత్తికొండలో 117, ఎమ్మిగనూరు సబ్ ట్రెజరీలో 227 మంది పెన్షనర్లు సర్టిఫికెట్లను అందచేయాల్సి ఉంది. జీవన్ప్రమాణ్ యాప్ ద్వారా లేదా ఈ–కేవైసీ ద్వారా అప్లోడ్ చేయవచ్చని ట్రెజరీ అధికారులు చెబుతున్నారు. ఈ నెల చివరిలోగా మాన్యువల్ వెరిఫికేషన్ రిపోర్టులను అందచేయాలని అధికారులు సూచించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేసిన పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని ఆదివారం కర్నూలులోని కొత్తపేట, ప్రకాష్నగర్లలో వివిధ ప్రజా సంఘాలు ప్రచారం నిర్వహించాయి. సీఐటీయూ, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ నాయకులు కంగార కుమార్, వి.రవికుమార్, సి.లక్ష్మన్న, కె.రమేష్, అలాగే అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల, కర్నూలు మండలం దిన్నెదేవరపాడులో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కేవీ నారాయణ, మండల కార్యదర్శి పీబీ హుసేనయ్యల ఆధ్వర్యంలో, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప ఆధ్వర్యంలో ఆటోలకు స్టిక్కర్లను అతికించి పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

5న బ్రాహ్మణ మహిళలకు సత్కారం

కర్నూలు(అర్బన్): ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 5వ తేదీన గుంటూరు జిల్లా తెనాలిలో బ్రాహ్మణ మహిళలకు సత్కార కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు బ్రాహ్మణ అన్యాక్రాంతుల ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్ సముద్రాల హనుమంతరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరవుతున్నట్లు చెప్పారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన మేటి మహిళలకు సన్మానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వీలుగా అన్ని జిల్లాల నుంచి వాహనాలను ఏర్పాటు చేస్తామన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు(హాస్పిటల్): సమతుల ఆహారంతో ఆరోగ్యం సిద్ధిస్తుందని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య చెప్పారు. సయద్ రసూల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం స్థానిక జొహరాపురంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి గుండెపరీక్షలు, కంటి పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం చేయాలని, సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగకరమని, చికిత్సతో పాటు వైద్యసలహాలు, సూచనలు కూడా అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సయ్యద్ ఖాలిద్, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణ శిబిరాలకు సహకారం అందించండి

కర్నూలు (టౌన్): వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించి మేటి క్రీడాకారులుగా మలిచేందుకు నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు సహకారం అందించాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక మేయర్ క్యాంపు కార్యాలయంలో నగర మేయర్ బివై.రామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. వచ్చే వేసవిలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమాలపై చర్చించారు. పెద్ద సంఖ్యలో నిర్వహించే శిక్షణ శిబిరాలకు సంబంధించి క్రీడా శిక్షణ నిర్వహకులు వచ్చే నెల 5వ తేదీలోపు స్థానిక దామోదరం సంజీవయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ దాసరి సుధీర్ను కలిసి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దీనిపై స్పందించిన మేయర్ తమ వంతు సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. మేయర్ను కలిసిన వారిలో ఒలింపిక్ సంఘం ప్రతినిధులు గుడిపల్లి సురేందర్, కోలా ప్రతాప్, నాగరత్నమయ్య, వెంకటేష్లు ఉన్నారు.

సమాజంలో నర్సింగ్ వృత్తికి ప్రాముఖ్యత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ కేవీ తులశమ్మ

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో నర్సింగ్ వృత్తికి ఎంతో ప్రాముఖ్యత ఉందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ కేవీ తులశమ్మ చెప్పారు. ఆదివారం కర్నూలులోని కళాంజలి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్) నర్సింగ్ కళాశాలలో ల్యాంప్ లైటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేవీ తులశమ్మ మాట్లాడుతూ రోగులకు వైద్యుల తర్వాత సేవలందించడంలో నర్సులదే కీలకపాత్ర అన్నారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు, చదువుకున్న సంస్థకు పేరు తేవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయవర్ధన్రెడ్డి మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు శిక్షణా సమయం చదువులో భాగమని, దీనిని దైవసమానంగా భావించి రోగులకు నిష్పక్షపాతంగా మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో గీతాంజలి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వసంతకుమారి, కళాంజలి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అర్చన, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిల్లలు స్తబ్దుగా ఉంటే నిర్లక్ష్యం చేయొద్దు



వైద్యశిబిరంలో బాలున్ని పరీక్షిస్తున్న డాక్టర్ ఎం.శ్వేత

కర్నూలు(హాస్పిటల్): పిల్లలు ఎలాంటి ఆటలు ఆడుకోకుండా, హుషారుగా లేకుండా స్తబ్దుగా ఉంటే నిర్లక్ష్యం చేయొద్దని చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ ఎం.శ్వేత చెప్పారు. ఆదివారం స్థానిక సంతోష్నగర్లో అపోలో సహకారంతో చిన్నపిల్లల వ్యాధులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.శ్వేత మాట్లాడుతూ వంశపారంపర్యంగా, మేనరికపు వివాహాలు, పలు రకాల గాయాల వల్ల చిన్నపిల్లల ఎదుగుదలలో లోపాలు కనిపిస్తాయన్నారు. వీటిని తల్లిదండ్రులు సకాలంలో గుర్తించి వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలని చెప్పారు. నిర్లక్ష్యం చేస్తే పిల్లలు పెద్దయ్యాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె తెలిపారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలను వేసవి తీవ్రత అధికంగా ఉన్న సమయంలో బయటకు పంపకూడదన్నారు.

గోదాగోకులం కర్నూలుకు మకుటాయమానం

కర్నూలు కల్చరల్: గోదాగోకులం కర్నూలుకు మకుటాయమానంగా నిలుస్తుందని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. కర్నూలు నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో నిర్వహించనున్న శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆళ్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం శ్రీ వైభవేష్టి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో పలు పూజా కార్యక్రమాలు జరిగాయి. కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు, అఖండ విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. టీజీవీ కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదా గోకులం ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్పీ జాతీయ సహకార్యదర్శి వై.రాఘవులు, గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్లో భగవద్గీత తరగతులు

ఇస్కాన్ ఆధ్వర్యంలో భగరీథ కాంప్లెక్స్లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు జరిగాయి. శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. రామకృష్ణ ప్రభు భగవద్గీతపై ప్రవచనం చెప్పారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు.

భక్తిశ్రద్ధలతో భాను సప్తమి

స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భాను సప్తమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వయంగా ఆదిత్య అరుణ పారాయణ పూర్వక అభిషేకం చేశారు. అరుణ హోమం, గణపతి హోమం నిర్వహించారు. అభిషేకం చేస్తున్న సమయంలో ప్రత్యక్ష సూర్య కిరణాలు స్వామివారి మూల విగ్రహం ఆదిత్యంను తాకడంతో భక్తులు తన్మయత్వం చెందారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.